సాక్షి సిద్దిపేట

గురువారం । 23 । మే । 2024



దినదినగండంగా..

జిల్లాలో బీడీ కార్మికులకు ఉపాధి కరువైంది. దీంతో బతుకులు భారంగా వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం ఉపాధి కల్పించాలని వేడుకుంటున్నారు. వివరాలు 8లో ▸



ట్రాన్స్ కో.. జర చూస్కో

సిద్దిపేట పట్టణంలో ఇష్టారాజ్యంగా వృక్షాలను నరికేస్తున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వాకం వల్ల చెట్లు నేలవాలుతున్నాయి. వివరాలు 8లో ▸



నేటి నుంచి ఎల్లమ్మ జాతర

హుస్నాబాద్ పట్టణంలో గురువారం నుంచి రేణుకా ఎల్లమ్మ జాతర జరగనుంది. వచ్చే నెల 22 వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కవిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెస్ట్ అవేలబుల్ స్కూల్ స్కీంలో భాగంగా ఒకటవ తరగతి, 5వ తరగతుల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు జూన్ 7లోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. జూన్11న అర్హులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ప్రతి కార్మికుడు పేరు నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి యాదవ్

సిద్దిపేటకమాన్: ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ డిపార్ట్‌మెంట్‌లో పేరు నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి యాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు భవనంలో బుధవారం అసంఘటిత కార్మికులతో న్యాయమూర్తి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికుల సంక్షేమ పథకాల గురించి వివరించారు. గుర్తింపు కార్డు ఉంటేనే సంక్షేమ పథకాలకు అర్హులన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ బాలయ్య, శ్రీకర్‌రెడ్డి, వెంకటేశ్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి



కూలీలతో మాట్లాడుతున్న వెంకట్‌మావో

చేర్యాల(సిద్దిపేట): 'ఉపాధి' కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. బుధవారం ముస్త్యాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ చట్ట ప్రకారం పనిచేసిన 15 రోజుల్లో కూలీ డబ్బులు చెల్లించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రోజు కూలి రూ.300 చెల్లించకుండా కేవలం రూ.వందలోపే చెల్లిస్తున్నారన్నారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గుండ్ర రవీందర్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

సిద్దిపేటకమాన్: జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్న పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు జరగనున్నందున పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేసి ఉంచాలని, 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండకూడదని సీపీ పేర్కొన్నారు.

ఉద్యానం చతికిల..

సాగు వెలవెల

- నిధుల్లేక ముందుకుసాగని పథకాలు
- కానరాని 'పాలీహౌస్', 'పందిరి'
- ఏటేటా తగ్గుతున్న కూరగాయల సాగు
- 'వెజిటబుల్ హబ్'గా ఉమ్మడి మెదక్ జిల్లా
- ప్రభుత్వ చేయూతపైనే కోటి ఆశలు



గజ్వేల్ ప్రాంతంలో కూరగాయల సాగు

ఉద్యాన పథకాలు చతికిల పడ్డాయి. నిధుల కొరత కారణంగా 'పాలీహౌస్' పథకానికి మంగళం పాడగా.. కేటాయింపుల్లేక 'పందిరి సాగు' సైతం ఇదే రకమైన పరిస్థితులు నెలకొన్నాయి. విస్తారమైన కూరగాయల సాగుతో 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించిన ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులకు సహకారం లేక సాగును తగ్గించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఉద్యాన పథకం తీరు మారేనా? అని రైతులు ఎదురుచూస్తున్నారు.

– గజ్వేల్

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధాన పంటలు వరి, పత్తి, మొక్కజొన్నకు దీటుగా కూరగాయలు సాగవుతున్నాయి. సుమారు 15లక్షల ఎకరాల్లో సాగులోకి వస్తుండగా.. ఇందులో 2.5లక్షల ఎకరాలకుపైగా వివిధ రకాల కూరగాయల పంటలు సాగులోకి వచ్చేవి. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లా 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించింది. ప్రత్యేకించి గజ్వేల్, పటాన్‌చెరు, సిద్దిపేట, నర్సాపూర్, మెదక్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో కూరగాయలు విస్తారంగా సాగులో ఉండేవి. శ్రమను నమ్ముకొని జీవించే కూరగాయల రైతులకు వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఏ యేటికాయేడు కుంగదీస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో రైతులకు లాభాల పంట పండించడానికి 'పాలీహౌస్' ప్రభుత్వం తరుణోపాయంగా భావించి ఎనిమిదేళ్ల క్రితం అమలు చేసింది. ఈ పథకం కింద ఎకరాకు 75శాతం సబ్సిడీతో రూ.39లక్షలను ప్రభుత్వం అందజేసింది. రైతు తన వాటా కింద రూ.8.44లక్షలు చెల్లిస్తే చాలు...'పాలీహౌస్'కు సంబంధించి అన్ని రకాల పరికరాలను పొలంలో బిగించేవారు.

పందిరి సాగు సైతం..

పాలీహౌస్‌లపై ఆశలు చాలించుకున్న రైతులు కనీసం 'పందిరి సాగు' ద్వారానైనా కూరగాయలు సాగుచేద్దామనుకుంటే.. కొన్నేళ్లుగా ఈ పథకానికి ఉద్యాన శాఖ నుంచి నిధులు రావటం లేదు. పందిరి పరికరాల కోసం ఎకరాకు రూ.లక్ష వరకు అందించి ఇందులో 50శాతం సబ్సిడీ ఇచ్చేవారు. ఈ పథకం కోసం ఎంతోమంది రైతులు దరఖాస్తు చేసుకొని ఉద్యాన శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారేలేరు. ఉపాధి హామీ పథకంలో నామమాత్రంగా ఈ పథకానికి అమలు చేస్తున్నా...అదీ కూడా ముందుకుసాగటంలేదు. దీంతో పాటు కూరగాయల సాగుకు అవసరమయ్యే డ్రిప్ పరికరాలు సకాలంలో అందకపోవడం కూడా రైతులను కుంగదీస్తున్నది.

'పాలీహౌస్'కు మంగళం

ఉమ్మడి మెదక్ జిల్లాలో పాలీహౌస్ పథకం ఆశించిన విధంగా అమలు కాలేదు. 2014–15, 2015–16, 2016–17 ఏడాదిలకు సంబంధించిన కేవలం 200 ఎకరాలకు మాత్రమే పథకాన్ని వర్తింపజేయగలిగారు. పథకం ప్రారంభించిన తొలి ఏడాదిలోనే 250 ఎకరాల్లో రైతులకు పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. కానీ ఈ టార్గెట్‌ను మూడేళ్లల్లో కూడా సాధించలేకపోయారు. పలువురు రైతులకు మంజూరు పత్రాలు వచ్చినా.. నిధులు విడుదల కాక కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారి పోయారు. నిధుల కొరత వల్ల ఈ పథకానికి ప్రభుత్వం దాదాపు మంగళం పాడింది.

చేయూత దక్కేనా?

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉత్పత్తి అవుతున్న కూరగాయలు నగరానికే కాకుండా ఢిల్లీ, కోల్‌కతా, చంద్లాపూర్, బెంగళూర్ లాంటి ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇలాంటి సందర్భంలో రైతులకు ఎంత చేయూతనిచ్చిన తక్కువే. కానీ.. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేక సాగు తగ్గే పరిస్థితి వస్తున్నది. ఒకప్పుడు 3లక్షల ఎకరాల్లో సాగయ్యే కూరగాయలు ప్రస్తుతం లక్షన్నర ఎకరాల్లోపే సాగులోకి వస్తున్నాయి. కూరగాయల సాగు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లోనైనా వివిధ పథకాలకు సబ్సిడీలను ప్రత్యేకంగా అమలు చేసే దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.



చిన్నకోడూరు కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

బోనస్ పేరుతో మోసం

- కాంగ్రెస్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- చిన్నకోడూరు కొనుగోలు కేంద్రం సందర్శన

చిన్నకోడూరు(సిద్దిపేట): వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకే అంటూ కాంగ్రెస్ సర్కారు రైతులను మోసం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. బుధవారం చిన్నకోడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వకుంటే 95 శాతం మంది రైతులను మోసం చేసినట్లేనని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తడిసిన వడ్లతో సహా అన్ని వడ్లను కొంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి వేరేలా ఉందన్నారు. కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా వేచి చూస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 40 శాతం ధాన్యం కేంద్రాల్లోనే ఉందన్నారు. వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షులు పాపయ్య, సొసైటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

చిన్నకోడూరులోని బీరప్ప ఆలయ ఉత్సవాల్లో హరీశ్‌రావు బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మాచాపూర్‌లో జరుగుతున్న మడలేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



బీమా చెక్కు అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పార్టీ కార్యకర్త, నంగనూరు మండల కేంద్రానికి చెందిన యాదగిరి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ క్రమంలో బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మృతుడి భార్యకు రెండు లక్షల బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించామన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలోని 48 మందికి రెండు లక్షల చొప్పున రూ. 96 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు.

అక్రమాలు వెలికితీయండి

జిల్లా క్రీడా శాఖ అధికారికి కాంగ్రెస్ ఫిర్యాదు



జిల్లా క్రీడాశాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని స్టేడియం నిర్వహణలో జరిగిన అక్రమాలను అధికారులు వెలికితీయాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా క్రీడా శాఖ అధికారి నాగేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ట్రోఫీ పేరిట పోటీలు నిర్వహించారని, స్టేడియం నిర్వహణకు ఎలాంటి ఆదాయం ఇవ్వలేదని ఆరోపించారు. కొందరి చేతుల్లో స్టేడియం ఉందని, భవిష్యత్తులో అందరికీ ఉపయోగపడేలా చూస్తామని అన్నారు. క్రీడా శాఖ అధికారికి తెలియకుండా స్టేడియం నిర్వహణ సాగుతోందని ఆరోపించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మధు, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు పూజలు



ఏడుపాయల్లో అమ్మవారి పల్లకీ సేవ

పాపన్నపేట(మెదక్): పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం ఏడుపాయల వన దుర్గమ్మను పల్లకీలో ఊరేగించారు. ఆలయ అర్చకులు, పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయం నుంచి గోకుల్‌షెడ్ వరకు భజనలు చేస్తూ పల్లకీ సేవ కొనసాగించారు. కార్యక్రమంలో ఈఓ మోహన్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



అందరి కళ్లు ఈ కారుపైనే..

ఈ విచిత్ర వాహనం ఏమిటీ అని సందేహ పడుతున్నారా? రెండు రోజులుగా సిద్దిపేటలోని ప్రధాన రహదారుల్లో తిరుగుతున్న ఈ వాహనంపైనే అందరి కళ్లు ఉన్నాయి. పైగా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. నగరానికి చెందిన ఒక సంస్థ ఐ ఫోన్ వినియోగదారుల కోసం 360 డిగ్రీల వ్యూస్ మ్యాపింగ్ కోసం పట్టణంలో తిరుగుతున్నట్లు సమాచారం. గూగుల్ మ్యాప్ తరహాలో లొకేషన్ మ్యాప్ రూపకల్పన కోసం సిద్దిపేట వచ్చినట్లు వారు పేర్కొంటున్నారు.

– సిద్దిపేటజోన్

చిరుధాన్యాల్లోనే పోషక విలువలు



సీడ్ బాల్స్ తయారీ, వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సునీతారెడ్డి తదితరులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని ఆర్గానిక్ ఫార్మర్ సామ ఎల్లారెడ్డి అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకొని గురువారం పభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో 'జీవవైవిధ్య సంరక్షణ ప్రణాళికలో భాగస్వాములం అవుదాం' అనే అంశంతో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామ ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఆర్గానిక్ విధానంలో పండించిన పంటల ద్వారా తయారు చేసిన ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం సీడ్ బాల్స్ తయారీ, చిరు ధాన్యాల ఉత్పత్తులు, వాటి ఉపయోగాన్ని వివరించారు. విద్యార్థులకు పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్, జిల్లా జీవ వైవిధ్య మండలి కో ఆర్డినేటర్ సంజీవ్, పర్యావరణ కార్యకర్త జ్ఞానేశ్వర్, ఆహార యోగా స్టోర్స్ డైరెక్టర్ సునీతారెడ్డి, జీవ వైవిధ్య యాజమాన్య కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, అధ్యాపకులు అయోధ్యారెడ్డి, మధుసూదన్ రెడ్డి, విశ్వనాథం, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి ఎస్ఐ సస్పెన్షన్



ఎస్ఐ నాగరాజు

కొమురవెల్లి(సిద్దిపేట): ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.నాగరాజును సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్. నాగరాజు తన భార్య ఉండగానే మరో మహిళతో సహజీవనం చేస్తున్నట్లు ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొమురవెల్లి పీఎస్ ఎదుట మంగళవారం రాత్రి వరకు తన బంధువులతో కలసి భార్య ఆందోళన చేసిన విషయం విదితమే. ఈ ఘటనపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ విచారణ జరిపారు. ఆరోపణలు నిర్ధారణ కావడంతో నాగరాజును సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

నాచగిరీశునికి శత కలశాభిషేకం



నాచగిరీశుని సన్నిధిలో కలశపూజ నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారి సన్నిధిలో భక్తులు

వర్గల్(గజ్వేల్): నృసింహ జయంతి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరిలో బుధవారం మహోన్నత ఘట్టం ఆవిష్కృతమైంది. స్వాతి నక్షత్ర వేళ స్వామివారి దివ్యమంగళ రూపం దర్శించుకుని భక్తజనులు పునీతులయ్యారు. జయంతి ఉత్సవాలలో భాగంగా ఉదయం విశేష అభిషేకం, మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, శతఘట కలశాభిషేకాది కార్యక్రమాలు కొనసాగాయి. మధనానంద క్షేత్ర పీఠాధిపతి మాధవానంద సరస్వతి, గజ్వేల్ సెషన్ కోర్టు జడ్జి ప్రియాంక క్షేత్రం సందర్శించి లక్ష్మీనృసింహుని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. అన్నపూర్ణ సమక్షంలో ఉదయం 10 గంటలకు ఆలయ మహామండపం వేదికగా అర్చక, పురోహితులు శతఘట కలశాభిషేకానికి శ్రీకారం చుట్టారు. కలశ స్థాపన, కలశ పూజ నిర్వహించారు. నృసింహనామం పఠిస్తూ గర్భగుడిలో మూలవిరాట్టుకు కలశాభిషేకం జరిపారు. నగరంతోపాటు ఉమ్మడి మెదక్‌జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తజనులు ఉత్సవాలలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి మహా నివేదనతో జయంత్యుత్సవాలు ముగిశాయి.

నూతన ఒరబడి

- మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట
- మహిళా సంఘాలకు సర్కారు బడుల బాధ్యత
- మూడు జిల్లాలకు రూ.82.11 కోట్లు మంజూరు
- ఇప్పటికే 25 శాతం నిధులు విడుదల



జిల్లా	ఎంపికైన బడులు
సిద్దిపేట	814
సంగారెడ్డి	756
మెదక్	562

సర్కారు బడి అద్భుత ప్రగతి సాధించబోతుంది. మహిళా సాధికారతే లక్ష్యంగా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం విద్యాశాఖకు భారీగా నిధులు కేటాయించింది. ఉమ్మడి మెదక్ జిల్లాకు మొత్తం రూ. 82,11,24,000 మంజూరు చేయగా.. ఇందులో 25 శాతం నిధులు రూ. 20.21 కోట్లు సంబంధిత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అకౌంట్లలో జమ చేసింది.

– పాపన్నపేట(మెదక్)

మహిళా సాధికారతతో సర్కారు బడుల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసింది. స్వయం సహాయక గ్రూపు అధ్యక్షులు కమిటీ చైర్‌పర్సన్లుగా, పాఠశాలల హెచ్‌ఎంలు కన్వీనర్లుగా కొనసాగుతారు. వీరి ఆధ్వర్యంలోనే పాఠశాలల పనులు కొనసాగాలి. కనీస సౌకర్యాలు మెరుగు పర్చడం, బాలికల టాయిలెట్లు, తాగునీరు, మైనర్, మేజర్ మరమ్మతులు, టాయిలెట్ల ఆధునికీకరణ, క్లాస్ రూంల విద్యుద్దీకరణ, పరిసరాల పరిశుభ్రత, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, యూనిఫాంలు కుట్టడం, పాఠశాల నిర్వహణ లాంటి పనులు చేపట్టాలి.

అప్రమత్తమైన అధికారులు

జూన్ 12న బడులు తెరిచే నాటికి పనులు పూర్తి కావాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సూచించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అన్ని చోట్ల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ బాధ్యులే పనులు చేయాల్సి ఉంది. చైర్‌పర్సన్లు అంతా మహిళలే కావడంతో కొన్ని చోట్ల పనులు సాగడం లేదని తెలుస్తోంది. మొదటగా విడుదలైన 25 శాతం నిధుల నుంచి తాగునీటి సంపులు, టాయిలెట్లు, రన్నింగ్ వాటర్, విద్యుద్దీకరణ తొలి ప్రాధాన్యాంశాలుగా తీసుకున్నారు. సంగారెడ్డి జిల్లాలో 1,297 పాఠశాలలుండగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 756, సిద్దిపేట జిల్లాలో మొత్తం 1,018 పాఠశాలలుండగా 814, మెదక్ జిల్లాలో మొత్తం 922 పాఠశాలలుండగా 562 ఎంపిక చేశారు. ఇందులో సిద్దిపేటలో 99 శాతం, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 100 శాతం పనులు ప్రారంభమైనట్లు అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

పెట్రోల్ బంకులో మోసం

లీటర్‌కు 50 ఎమ్ఎల్ తక్కువ



ఆందోళన చేస్తున్న వాహనదారులు

శివ్వంపేట(నర్సాపూర్): బంకులో వాహనదారులకు తక్కువ పెట్రోల్ పోస్తూ మోసం చేస్తున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రమైన శివ్వంపేటలో ఉన్న భారత్ పెట్రోల్ బంకులో ఓ వినియోగదారుడు లీటర్ పెట్రోల్ కొనుగోలు చేస్తే 50 ఎంఎల్ తక్కువ వచ్చింది. ఈ విషయంలో బంకు నిర్వాహకులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వాహనదారులు ఆందోళన చేశారు. కొలతల్లో మోసానికి పాల్పడుతున్న బంకు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బంకు వద్దకు చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి బంకును తాత్కాలికంగా మూసివేశారు.

సారవంతమైన భూమిలోనే అధిక దిగుబడులు



సూచనలు చేస్తున్న రాజ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): సారవంతమైన భూమిలోనే అధిక దిగుబడులు వస్తాయని, రైతులందరూ పొలాల్లో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని అధిక దిగుబడులు పొందాలని మన గ్రోమోర్ సెంటర్ జోనల్ మార్కెటింగ్ మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సంబంధించి మట్టి నమూనాలను పరీక్షించి నివేదికలు అందించారు. కార్యక్రమంలో మేనేజర్లు సురేశ్, జానకయ్య, చేర్యాల మేనేజర్ మధుసూదన్, ఫీల్డ్ ఆఫీసర్ మురళీ, నాగరాజు, రైతులు తిరుపతిరెడ్డి, కిషన్, భాస్కర్, రాజశేఖర్, మహేందర్, నరేశ్, ఇమామ్, కొమరయ్య, యాదయ్య, సంపత్, ప్రశాంత్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు చేర్చండి

అదనపు కలెక్టర్ మాధురి

కంది(సంగారెడ్డి): రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు చేర్చి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని అదనపు కలెక్టర్ మాధురి అధికారులకు సూచించారు. బుధవారం కందిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజూ కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు పంపాలన్నారు. ధాన్యం తీసుకొచ్చేందుకు అవసరమైన గోనే సంచులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే వర్షంలో ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లను కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. పీఏసీఎస్‌లో ఇప్పటి వరకు 421 మంది రైతుల నుంచి 4,016 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సీఈఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మిల్లుల వద్ద లారీలు త్వరగా ఖాళీ కాక పోవడంతో ధాన్యం నిలిచి పోతుందని వివరించారు. లారీలు త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వ్యక్తి మృతిపై అనుమానాలు

పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): పద్నాలుగు రోజుల కిందట మృతి చెందిన వ్యక్తిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి పోతులపోగూడ గ్రామానికి చెందిన కొనేటి పోచయ్య(60) ఈ నెల 8న గ్రామ శివారులోని నీటి గుంటలో పడి మృతిచెందాడు. సహజ మరణంగా భావించి అంత్యక్రియలు జరిపించారు. పోచయ్యకు సమీప బంధువైన ఇదే గ్రామానికి చెందిన నర్సమ్మ భూమి అమ్మకానికి పెట్టారు. పలువురు రియల్ వ్యాపారులు తక్కువ ధరకు ఆమె నుంచి భూమి కొనుగోలు చేస్తున్నారని పోచయ్య అడ్డుపడ్డాడు. దీంతో పోచయ్యను అడ్డు తొలగించుకోవాలని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు హత్యచేసి నీటి కుంటలో పడేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

వేసవి కాలం వచ్చిందంటే బీహెచ్‌ఈఎల్ టౌన్ షిప్‌లోని క్రీడా మైదానాలు చిన్నారులతో కళకళలాడుతున్నాయి. 45 ఏళ్లుగా భెల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతీఏటా వివిధ క్రీడల్లో చిన్నారులకు సమ్మర్ క్యాంపు నిర్వహించి మెరుగైన శిక్షణను అందిస్తున్నారు. ఈ క్రీడా మైదానాలతో ఆడిన అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



డాన్స్ నేర్చుకుంటున్న చిన్నారులు

సమ్మర్ క్యాంప్.. ఫుల్ జోష్

కళకళలాడుతున్న భెల్ క్రీడా మైదానాలు

- 12 క్రీడల్లో 630 మందికి శిక్షణ
- అంతర్జాతీయ స్థాయిలో రాణింపు
- ఆసక్తి చూపుతున్న చిన్నారులు

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో సుమారు 45 ఏళ్లుగా కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో చిన్నారులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఇందులో కార్మికుల పిల్లలతోపాటు బయట వారికి అవకాశం కల్పిస్తున్నారు. ఎక్కడా లేని విధంగా అన్ని క్రీడలకు వేర్వేరుగా క్రీడా మైదానాలు ఉండడంతో ఈ సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ తీసుకునేందుకు చిన్నారుల తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నారు.

35 రోజులు నిర్వహణ

ప్రతీ ఏటా వేసవిలో భెల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో 35 రోజులు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. వాలీబాల్, అథ్లెటిక్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, షటిల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, రోలర్ స్కేటింగ్, కర్రసాము, గిటార్, కీబోర్డ్, వోకల్ సింగింగ్, యోగా, చిత్రలేఖనం, స్విమ్మింగ్‌లో ఎంతో నైపుణ్యం కలిగిన కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నారు.

630 మందికి శిక్షణ..

35 రోజుల నిర్వహించే ఈ సమ్మర్ క్యాంప్‌లో 630 మంది చిన్నారులు వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో నేర్చుకుంటున్నారు. భెల్ కాలనీలోని సుమారు 10 క్రీడా మైదానాల్లో చిన్నారుల ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది.



చిత్రలేఖనంలో శిక్షణ పొందుతూ..



బాస్కెట్ బాల్ ఆడుతున్న చిన్నారులు

క్రీడలపై మరింత ఆసక్తి



నా బాల్యంలో ప్రతీ వేసవిలో భెల్ జరిగే సమ్మర్ క్యాంప్‌నకు వెళ్లి వాలీబాల్ ఆడేవాన్ని. ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనడం ద్వారానే క్రీడలపై మరింత ఆసక్తి పెరిగింది. వాలీబాల్ పై ప్రత్యేక దృష్టి సారించాను. సమ్మర్ క్యాంప్‌లే జీవితాన్ని మార్చివేశాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాను. భారత్ బీచ్ వాలీబాల్ కెప్టెన్ అయ్యాన్, క్రీడల్లో రాణించి కస్టమ్స్‌లో ఉద్యోగం సైతం సాధించాను.

– ఎం.కృష్ణంరాజు, భారత్ బీచ్ వాలీబాల్ కెప్టెన్, కస్టమ్స్ అధికారి

భెల్ యాజమాన్యం సహకారంతో..



కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో భెల్ యాజమాన్యం సహకారంతో ప్రతీ వేసవిలో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం ఈ సమ్మర్ క్యాంప్‌లో 630 చిన్నారులు వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. 35 రోజులపాటు ఈ క్యాంప్‌ను నిర్వహించి, ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తాం.

– శ్రీకాంత్ కమ్యూనిటీ సెంటర్, ప్రధాన కార్యదర్శి

స్విమ్మింగ్ నేర్పిస్తున్నా..



భెల్‌లోని సమ్మర్ క్యాంప్‌లో మంచి శిక్షణను అందిస్తున్నారు. మా బాబు భార్గవ్‌కు స్విమ్మింగ్ నేర్పిస్తున్నాను. ప్రస్తుతం స్విమ్మింగ్‌లో నైపుణ్యం సంపాదించాడు. చాలా మంది పిల్లలు ఇక్కడికి వచ్చి నేర్చుకుంటున్నారు.

– నాగరాజు గౌడ్, బీడీఎల్ కాలనీ

జంట హత్యల కలకలం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ వెంకట్ రెడ్డి
- మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఘటన



మృతదేహాలపై లభించిన ఉంగరాలు, ఇతర వస్తువులు

నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లా నర్సాపూర్ రాయరావు చెరువు కట్ట కింద గుర్తు తెలియని జంట హత్యలు బుధవారం కలకలం సృష్టించాయి. నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సై పుష్పరాజు కథనం మేరకు. నర్సాపూర్ రాయరావు చెరువు కట్ట కింద చెట్ల పొదల్లో గుర్తు తెలియని ఓ మహిళ, పురుషుడి మృతదేహాలు ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ఇద్దరి మృతదేహాలపై బట్టలు లేకుండా కుళ్లిపోయి ఉన్నాయి. వీరి వయస్సు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. ఇద్దరినీ ఎక్కడైనా హత్య చేసి ఇక్కడికి తీసుకొచ్చి వేశారా.. ఘటనా స్థలంలోనే హత్య చేశారా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి సైతం సందర్శించారు. ఎక్కడైనా అదృశ్యమైన వ్యక్తుల వివరాలు ఉంటే నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి ఫోన్ 87126 57940, ఎస్సై పుష్ప రాజ్ 87126 579418 సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకొని ఘటనా స్థలంలోని మృతదేహాల పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో మోసం

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద రూ.4.40 లక్షలు
- కిరాణా షాపు వ్యాపారి వద్ద రూ. 4.67 లక్షలు కాజేసిన వైనం

పటాన్ చెరు టౌన్: పార్ట్ టైమ్ జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.4.40 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైమ్ జాబ్ అంటూ వాట్సాప్‌కు ఏప్రిల్ 16న మెసేజ్ వచ్చింది. ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.4.40 లక్షలు చెల్లించాడు. చివరిగా ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో కిరాణా షాప్ వ్యాపారి..

అమీన్‌పూర్ పరిధిలోని నరేందర్ నగర్ కాలనీకి చెందిన ఓ కిరాణా షాప్ వ్యాపారికి మే 6వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. మొత్తం రూ.4.67 లక్షలు పెట్టుబడి పెట్టాడు. చివరికి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి బుధవారం అమీన్‌పూర్ పోలీసుల ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మాడ్గి చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. చిరాగ్ పల్లి ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లి మండలంలోని మాడ్గి గ్రామానికి చెందిన ఉప్పరి నగేశ్ (33) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనుల కోసం మంగళవారం కర్నాటక రాష్ట్రంలోని మన్నెకెల్లికి వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. మాడ్గి చౌరస్తాలో బస్సు దిగి రోడ్డు దాటుతుండగా జహీరాబాద్ వైపు నుంచి ముంబాయి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని మరో వ్యక్తి

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి మండలం దామరంచ గ్రామానికి చెందిన శంభు నర్సింలు(24) భార్య మౌనిక, తల్లి ఎల్లమ్మ కలిసి తన కుమార్తె పుట్టు వెంట్రుకల కోసం బైక్‌పై బట్టలు తీసుకునేందుకు మెదక్‌కు వచ్చారు. పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మెదక్ మండలం మంభోజిపల్లి గ్రామం వద్ద ఆగి ఉన్న సిమెంట్ లారీని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో నర్సింలు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య మౌనిక, తల్లి ఎల్లమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి తరలించినట్లు ఎఎస్ఐ శివకుమార్ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరు మృతి



స్వామి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వర్గల్ మండలం నెంటూరులో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్ఐ భువనేశ్వర్ రావు కథనం మేరకు.. నెంటూరుకు చెందిన పూదూరి స్వామి(28)కి భార్య చందన, 9 ఏళ్లలోపు ఇద్దరు పిల్లలు సాక్షిత, మణి ఉన్నారు. కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసైన స్వామి తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి చేపలు పట్టేందుకు గ్రామ సమీప సామల చెరువు వద్దకు వెళ్లాడు. బుధవారం తెల్లవారినా స్వామి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. గ్రామంలోని సామలచెరువు వద్ద బైక్, చెప్పులను గుర్తించారు. చెరువులో వెతకగా స్వామి మృతదేహం లభ్యమైంది. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు తన భర్త చెరువులో మునిగి మృతి చెందినట్లు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేసిన వలె మృత్యుపాశమై..



రాజు(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): మంజీరా వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి, వేసిన వలలో చిక్కుకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన తలారి రాజు (44) నిత్యం మంజీరా వాగులో చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజూ మాదిరిగానే గ్రామ శివారులో ఉన్న మంజీరా వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వాగులో చేపల కోసం వలలు వేస్తుండగా ప్రమాదవశాత్తు అదే వల చిక్కుకొని వాగులో పడ్డాడు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న స్థానికులు గమనించి రాజు భార్య లక్ష్మికి సమాచారం ఇచ్చారు. ఆమె గ్రామస్తుల సహకారంతో వాగులో వెతకగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య



పావని (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తి పంచాయతీ పరిధి శేరీల గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి తండ్రి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొడె యాదమ్మ, శ్రీనివాస్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఆరు నెలల కిందట పొలం అమ్మగా వచ్చిన డబ్బులతో రెండో కూతురు వివాహం జరిపించారు. పెళ్లి ఖర్చులు పోగా మిగిలిన రూ.4 లక్షలు విషయంలో శ్రీనివాస్ రెండవ సోదరి మంజుల, తల్లి బాలమణి వేధింపులకు పాల్పడ్డారు. మిగిలిన డబ్బులు మూడవ కూతురు పావని(18) కోసమని దాచి ఉంచగా, వాటిని ఇవ్వాలని మూడు రోజుల కిందట ఇంట్లో గొడవ జరిగింది. అప్పటి నుంచి మనస్తాపంతో ఉంటున్న పావని అత్తమ్మ, నానమ్మ వేధింపులు తాళలేక బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురి మృతికి కారణమైన సోదరి మంజుల, తల్లిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

41 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో సీఐ శ్రీను, సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా రవాణ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ ఎల్.శ్రీను తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కొమురవెల్లి పోలీస్ స్టేషన్, చేర్యాల మండల పరిధిలోని పెద్దరాజుపేట గ్రామ శివారులో నూనె వెంకటేశ్ మంగళవారం రాత్రి డీసీఎంలో ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడని సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో వెళ్లి 41 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. కొమురవెల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసిన, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లి..

చెరువులో మునిగి విద్యార్థి మృతి



శివకుమార్ (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): చెరువులో మునిగి విద్యార్థి మృతి చెందిన ఘటన జిన్నారం మండలంలోని వావిలాలలో చోటు చేసుకుంది. జిన్నారం ఎస్ఐ విజయారావు కథనం మేరకు.. బాలాగర్‌లో నివాసం ఉంటున్న అవుసలి శివకుమార్(20) డిగ్రీ చదువుతున్నాడు. ఈనెల 20న ఏడుపాయలలో స్నేహితుడి అన్న కుమార్తె వివాహం ఉండటంతో వెళ్లాడు. పెళ్లి ముగిసిన అనంతరం మరుసటి రోజు వావిలాలోని పీర్యా చెరువులో స్నానం చేసేందుకు శివకుమార్‌తోపాటు తోటి స్నేహితులు అక్షయ్, కార్తీక్, గౌతరం, కరణ్‌సింగ్, యశ్వంత్‌లు వెళ్లారు. స్నానం చేస్తున్న సమయంలో శివకుమార్‌కు ఈత రాకపోవడంతో చెరువులో గుంతలో పడిపోయాడు. ఈ విషయాన్ని స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం శివకుమార్ మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయారావు తెలిపారు.

27 లోగా బకాయిలు చెల్లింపు

సంగారెడ్డి టౌన్: రైతులు, కార్మికులు, ప్రభుత్వానికి జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం చెల్లించాల్సిన వివిధ బకాయిలు ఈ నెల 27 తేదీలోగా చెల్లించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. బుధవారం పరిశ్రమలోని కార్మిక సంఘాల నాయకులు, పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ రామ్‌నాథ్, కలెక్టర్ క్రాంతి, జిల్లా కార్మిక శాఖ అధికారి షుగర్ కేన్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు, యాజమాన్యానికి పలు ఒప్పందాలు కుదిరినట్లు కలెక్టర్ తెలిపారు. ట్రైడెంట్ చక్కెర కర్మాగారం కార్మికులకు వేతన బకాయిలు పీఎఫ్, గ్రాట్యుటీ , ఎల్ఐసీ ప్రీమియం బకాయిలు 27వ తేదీన చెల్లించడానికి అంగీకరించి హామీ పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు చెల్లిస్తామని చెప్పినట్టు తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఇతర పన్నులు, అన్నీ కలిపి జూలై 1 రోజున చెల్లింపులు చేసి పరిశ్రమ తిరిగి పునః ప్రారంభించడానికి చర్యలు తీసుకోనున్నట్లు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ రవీందర్ రెడ్డి, కమిషనర్ రాజశేఖర్, కార్మిక సంఘం నాయకులు శ్రీరాములు, ట్రైడెంట్ చక్కెర పరిశ్రమ కార్మికులు యాజమాన్యం పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో వ్యవసాయం తర్వాత ప్రధానంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు బీడీ పరిశ్రమే ఏళ్లుగా అండగా ఉంది. దుబ్బాక, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లోని ప్రతీ గ్రామంలో వందలాది కుటుంబాలు ఆధారపడే లక్షకు పైగా కార్మికులు ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమలు క్రమంగా పనిని తగ్గిస్తుండటంతో ఎలాంటి ఉపాధి లేక పేద కుటుంబాలు దినదినగండంగా కాలం గడుపుతున్నాయి.

– దుబ్బాక



దుబ్బాకలో బీడీలు చుడుతున్న కార్మికులు

దినదినగండంగా..

లక్ష మంది బీడీ కార్మికుల బతుకులు

- మూతపడే దిశగా పరిశ్రమ
- దుర్భర పరిస్థితుల్లో కుటుంబాలు
- ప్రభుత్వం ఉపాధి కల్పించాలని వినతి

బీడీ పరిశ్రమపై ఆధారపడి లక్షకు పైగా కార్మికులు జీవనం గడుపుతున్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలు ఈ పరిశ్రమకు పుట్టినిల్లు. కొన్నేళ్లుగా పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల క్యాన్సర్ సోకుతుందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగగా కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. బీడీ కట్టలపై పుర్రె గుర్తులు, 85 శాతానికి పైగా డేంజర్ బొమ్మలు ముద్రించాలని యాజమాన్యాలకు ఆంక్షల విధించింది. బీడీలు తాగొద్దని పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో పరిశ్రమ క్రమంగా సంక్షోభంలోకి కూరుకుపోయింది.

పింఛన్ల కోసం ఎదురుచూపు

జిల్లాలో లక్షకు పైగా బీడీ కార్మికులుండగా వీరిలో పాత పీఎఫ్ ఉన్న కార్మికులను గుర్తించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్నేళ్లపాటు ఆసరా పింఛన్లు అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యథావిధిగా నెలకు రూ.2,016 పింఛన్‌ను ఇస్తుంది. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం పీఎఫ్ ఉన్న 47,464 మంది కార్మికులకు ఆసరా పింఛన్ నెలకు రూ.2,016 చొప్పున అందిస్తున్నారు. కొత్తగా పీఎఫ్‌లు వచ్చిన వారు ఇంకా సుమారుగా 30 వేల వరకు ఉంటారు. వీరికి కూడా పింఛన్లు అందిస్తామని గత ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇంతవరకు అమలు కాలేదు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా అందిస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లాలో లక్షకు పైగా బీడీ పరిశ్రమను నమ్ముకున్న కుటుంబాల పరిస్థితి చాలా దారుణంగా తయారైంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కార్మికులను ఆదుకోవాలి. దినదినగండంగా కార్మికుల కుటుంబాలు బతుకు వెళ్లదీస్తున్నాయి. ప్రభుత్వం ఈ కుటుంబాలకు అండగా నిలవాలి.

–తుమ్మ శంకర్, తెలంగాణ ఆల్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

20 ఏళ్లుగా బీడీలు చుడుతున్నా..



నేను 20 ఏళ్లకు పై నుంచి బీడీలు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. నాకు బీడీలు తప్ప వేరే పనిరాదు. ఇప్పుడు బీడీలు బంద్ అయితే చాలా ఇబ్బంది అవుతుంది. కార్ఖానాలు బంద్ అయితే మా లాంటి గరీబోళ్ల బతుకులు ఆగం అవుతాయి. ప్రభుత్వం బీడీ కార్మికులను ఆదుకోవాలి.

–జరీన, బీడీ కార్మికురాలు

ట్రాన్స్ కో.. జర చూస్కో

హరిత సిద్దిపేట కనుమరుగయ్యేలా ఉంది.. హరితహారంలో భాగంగా బల్దియాలో నాటిన మొక్కలు భారీ వృక్షాలుగా మారాయి. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం, సిబ్బంది ముందుచూపు వైఫల్యంతో చెట్లు నేలరాలుతున్నాయి. వర్షాకాలం కారణంగా వైర్ల కింద ఉన్న కొమ్మలను తొలగించాల్సిన విద్యుత్ శాఖ సిబ్బంది ఏకంగా చెట్టును పూర్తి స్థాయిలో నరికివేశారు. దీంతో పట్టణ ప్రధాన వీధుల్లో రెండు రోజులగా నరికిన చెట్టు మొదల్లు దర్శనమిస్తున్నాయి. విద్యుత్ వైర్లకు తాకే అవకాశం ఉన్న చెట్టు కొమ్మలను మాత్రం నరికితే చాలని, ఇలా ఏకంగా చెట్టు మొదలు వరకు నరకడం ఏమిటని పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

– సిద్దిపేటజోన్



సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొమ్మలను కాకుండా చెట్టును పూర్తి స్థాయిలో నరికిన దృశ్యం